క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన చాపర్తి రాజు, దుర్నాల రాజేశ్వర్‌రావు, కాటబత్తిని రాజశేఖర్, వీరయ్య, తుడుం మల్లయ్య, ఐలయ్య కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి అపదా వచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, కుమారస్వామి, సర్పంచ్ కమలరాజేశ్వర్‌రావు, నాయకులు రవీందర్, రాజస్వామి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నముద్దల బతుకమ్మ



బతుకమ్మతో చిన్నారి

నడికూడ: మండల కేంద్రంలో శనివారం ఏడో రోజు వెన్నముద్దల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పోచమ్మ గుడి వద్ద మహిళలు ఆట, పాటలతో బతుకమ్మ ఆడిపాడారు. వెంకటయ్య చెరువులో నిమజ్జనం చేశారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్

హసన్‌పర్తి: కాంగ్రెస్ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా కార్యదర్శిగా హసన్‌పర్తి మండలం ఎల్లాపురానికి చెందిన ఎర్ర ప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ప్రకటించారు. కాగా, తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, మాజీ అధ్యక్షుడు బాషబోయిన కుమారస్వామి, రేణుకుంట్ల దుర్గాప్రసాద్‌కు ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

తూర్పు కోఆర్డినేటర్‌గా అయూబ్

కాశిబుగ్గ: కాంగ్రెస్ పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా మహ్మద్ అయూబ్‌ను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తూర్పులో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తానన్నారు.

దసరా వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానం

కరీమాబాద్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకుని ఉర్సు రంగలీల మైదానంలో సోమవారం సాయంత్రం జరగనున్న రావణ వధ కార్యక్రమానికి హాజరు కావాలని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపురి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, వొడ్నాల నరేందర్, వంగరి కోటేశ్వర్, శ్రీనివాస్ కోరారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

కాజీపేట: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరుతూ కాజీపేట 62వ డివిజన్‌లోని పలు కాలనీల్లో శనివారం విస్తృత ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌తోనే దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

వ్యయాన్ని అదుపు చేయాలి

హన్మకొండ: రానున్న ఎన్నికల్లో ఖర్చు, డబ్బు ప్రభావాన్ని అదుపు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఆయన లేఖ రాశారు. హనుమకొండలో ఆ లేఖను శనివారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు శాసనసభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సభకు తరలిరావాలి

కాశిబుగ్గ: రాజకీయ పార్టీలకు అతీతంగా నవంబర్ 5న హైదరాబాద్‌లో జరగనున్న ఎరుకల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం కాశిబుగ్గలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఎరుకల సమాజాన్ని ఏ పార్టీ గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరుకలందరూ పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

కాళరాత్రి అలంకరణలో అమ్మవారు

● ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

ఐనవోలు: మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో శ్రీ భ్రమరాంభిక అమ్మవారి దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజు కొనసాగాయి. శనివారం దుర్గాదేవి కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకులు శ్రీసూక్తపారాయణం, కాళరాత్రి పూజ, నిత్యహ్నికం, నవవర్ణార్చన, ఖడ్గమాల, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్ల పాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, మధుకర్‌శర్మ, వేదపండితుడు గట్టు పురుషోత్తంశర్మ, విక్రాంత్, వినాయక్‌జోషి, అర్చకులు, నందనం మధు, భానుప్రసాద్‌శర్మ, మడికొండ దేవేందర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి భజనమండలి ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం దుర్గామాత కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. మేస్త్రీదేవండ్ల శిరీష-మాధవ్ దంపతులు అన్నదానం చేశారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి మహిళలతో కుంకుమపూజలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరకాల: శ్రీదేవి నవరాత్రోత్సవాల సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణంలో దేవీశరన్నవరాత్రి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కాళరాత్రి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనం ఇచ్చింది. శ్రీదేవి నవరాత్రోత్సవాల సందర్భంగా ఈనెల 23వ తేదీన అమ్మవారి సన్నిధానంలో పూజలందుకున్న 50వేల మంది మహిళలకు గాజులు అందజేయనున్నట్లు శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గండె వెంకటేశ్వర్లు తెలిపారు. దుర్గాష్టమి రోజున సాయంత్రం 6 గంటలకు జరిగే అమ్మవారి గాజుల పంపిణీలో మహిళ భక్తులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



ఆత్మకూరు: దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



పరకాలలో..



ఐనవోలులో..

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికెళ్లి ప్రచారం చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో రేణికుంట్ల కుమార్, కోఆప్షన్ సభ్యుడు కొమ్ముల సతీష్, బీజేపీ బూత్ అధ్యక్షుడు కొమ్ముల రమేష్, గ్రామ అధ్యక్షుడు ముక్కెర నితీన్, ఎస్సీమోర్చా అధక్షుడు ముక్కెర చిన్న సదయ్య, బీజేపీ గ్రామ కార్యదర్శి దొమ్మాటి రాజయ్యతో పాటు 30 మంది చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లతాలక్ష్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ స్వాతి, హుస్సేన్‌పల్లి సర్పంచ్ రజిత, గ్రామ అధ్యక్షుడు సుమన్, మాజీ సర్పంచ్ రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు నిమ్మల మహేందర్, సదానందం, యూత్ అధ్యక్షుడు విజయ్, వార్డు సభ్యులు కొమ్ముల సంతోష్ పాల్గొన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

జంగాకు టికెట్ ఇవ్వాలి



దుర్గామాతకు పూజలు చేస్తున్న సద్దాం

వేలేరు: కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ సెగ్మెంట్ నుంచి జంగా రాఘవరెడ్డికి టికెట్ ఇవ్వాలని వేలేరు ఉపసర్పంచ్ సులోచన సద్దాంహుస్సేన్ ఆ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఈమేరకు శనివారం దుర్గామాతకు ప్రత్యేక పూజ, హోమం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసేనాయకుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. జంగాకు టికెట్ రావాలని, భారీ మెజారిటీతో గెలువాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రధాన అర్చకులు రామ్ శర్మ, సంతోష్ శర్మ, వార్డు సభ్యులు అత్తెన రాజేందర్, మొగిలిచర్ల రమ సుదర్శన్, సూత్రపు అనిత సంపత్, వరికోలు చంద్రమౌళి, రాజేష్, సలీంమాలిక్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సుబేదారి పీఎస్ పరిధిలో మద్యం పట్టివేత

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వడ్డేపల్లికి చెందిన పల్లె ఉదయ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.7,680 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే, తాళ్లపల్లి సతీష్ ఇంట్లో మరో రూ.5,910 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై శరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

● బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండలంలోని గట్లకనిపర్తి, పెద్దకోడెపాక, జోగంపల్లి, కొప్పుల గ్రామాల్లో శనివారం ఆమె పాదయాత్ర చేశారు. అనంతరం కొప్పుల గ్రామంలో మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెప్రకృతివనం, వైకుంఠధామాలు, నర్సరీ, డంపింగ్‌యార్డు నిర్మాణాలు చేపట్టారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంక్షేమ పథకాల అమలు కోసం కేంద్రం రూ. 9లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. రూ. 5లక్షల ఆయుష్మాన్ భారత్ కార్డులను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఎరువులపై సబ్సిడీ అందిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాల ఆకాంక్షను తుంగలో తొక్కిందని విమర్శించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఇద్దరు నాయకులకు బీఫారం అందజేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో రైతులకు ఒరిగిందేమి లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు అడిగే నైతికహక్కు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందడం లేదని, కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కమీషన్ల ద్వారా అందజేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తనకు ఒకసారి అవకాశం కల్పించి ఆశీర్వదించాలని, అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తానన్నారు. రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ నాగపూరి రాజమౌళిగౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెన్నంపల్లి పాపయ్య, నాయకులు రాయరాకుల మొగిలి, రాంచంద్రం, రమణారెడ్డి, రవికిరణ్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, విజయ్, శివ, రాజు, నాగరాజు, స్వరూప, శిరీష తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడీ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న కీర్తిరెడ్డి

వాహన తనిఖీలు ముమ్మరం



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో వాహనాల తనిఖీలను ఎన్నికల అధికారులు ముమ్మరం చేశారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లలో నగదును రవాణా చేస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు అధికారులు వాహన తనిఖీలను శనివారం విస్తృతంగా చేపట్టారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎల్.రమేష్, తహసీల్దార్ భావుసింగ్‌తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా రావణ వధ నిర్వహిస్తాం

కరీమాబాద్: దసరా పండుగను పురస్కరించుకుని రంగశాయిపేట మహంకాళి గుడి ఆవరణలో రావణ వధ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహిస్తామని దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ అన్నారు. రంగశాయిపేట మహంకాళి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగశాయిపేట సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా మహంకాళి ఆవరణకు చేరుకుని రాత్రి 7.30 గంటలకు రావణ వధ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మంత్రి దయాకర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నరేందర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల జిల్లా సీనియర్ జడ్జి కంచ ప్రసాద్‌తోపాటు కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కరుణాకర్, భాస్కర్, రామమూర్తి, లక్ష్మయ్య, దర్శనం, అశోక్, రామకృష్ణ, ప్రసాద్, చంద్రమౌళి, రాజేశ్వర్‌రావు, రాజశేఖర్, శ్రీధర్, మనోహర్, రమేష్, వీరేశం, భిక్షపతి, శ్రీనివాస్, అశోక్, నవీన్‌కుమార్, వేణు, రఘు, వెంకటేశ్వర్లు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

వరంగల్: వరంగల్ రామలింగేశ్వర స్వామి దేవాలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ అప్పరాజు రాజు మాట్లాడుతూ నగరంలోని ప్రముఖ ఔషధ రిటైల్ ఏ టు జెడ్ మంతెన అనురాధ – రమేష్ కుమారుడు నిఖిల్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంతెన రమేష్, నిఖిల్, చిట్టిమళ్ల సురేష్, కటకం రాము, పప్పుల మంజుల, బిట్ల శేఖర్, గంగిశెట్టి హరినాథ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై వేటు

● ఫిర్యాదు మేరకు బ్లాక్ లిస్ట్‌లో..
● నిబంధనలకు విరుద్ధంగా గంటూరుపల్లి, నాగారం కేంద్రాల నిర్వహణ?

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలో ఇందిరా క్రాంతి పథకం కింద నిర్వహిస్తున్న రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారులు వేటు వేశారు. ఆ రెండు కేంద్రాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఫిర్యాదు అందడంతో రద్దు చేసినట్లు సమాచారం. గంటూరుపల్లితో పాటు నాగారం కొనుగోలు కేంద్రాలను ఈఏడాది నిర్వహించే జాబితా నుంచి తొలగించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆ రెండు కేంద్రాలు

ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో ఐదు కొనుగోలు కేంద్రాలకు అనుమతి ఉంది. అవి పెంబర్తి, జయగిరి, మడిపల్లి, గంటూరుపల్లి, నాగారం. వాటిలో గంటూరుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని నాలుగు నెలల క్రితం ఫిర్యాదు అందింది. దీంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే, నాగారం కొనుగోలు కేంద్రంలో అక్రమాలు జరుగుతున్నాయని రైతులు నేరుగా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో అప్పటి అదనపు కలెక్టర్ సంధ్యారాణి నివేదికను కోరారు. ప్రస్తుతం ఈరెండు కొనుగోలు కేంద్రాలను రద్దు చేశారు. ఈఏడాది నిర్వహణకు అధికారులు ఇంకా అనుమతి ఇవ్వలేదు.



రోడ్డుపై గుంత పూడ్చివేత

● సాక్షి కథనానికి స్పందన

నడికూడ: మండలంలోని పరకాల నుంచి కొకొండకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకపోవడంతో సాక్షి దినపత్రికలో ఈనెల 17వ తేదీన 'ఆదమరిస్తే ఔటే' అనే శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. దీంతో గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. మొరం,మట్టితో గుంతను పూడ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.



మట్టి పోసి పూడ్చిన గుంత

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి

శాయంపేట : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాన్ని ప్రతిఒక్కరూ సద్వీనియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. లైబ్రరీయన్ సుధాకర్ సమయపాలన పాటించడం లేదని పత్తిపాక గ్రామానికి చెందిన దళిత సంఘం నాయకులు నాగుల పవన్ కల్యాణ్, మగ్గం సుమన్‌లు ఫిర్యాదు చేయగా ఆమె శనివారం విచారణ చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, రీడర్లు రాము, రాజులను అడిగితెలుసుకున్నారు. విధులకు హాజరు అవుతున్నట్లు విచారణలో తేలడంతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఆమె వెంట జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో తనిఖీ చేస్తున్న శశిజాదేవి

'చల్లా'ను భారీ మెజారిటీతో గెలిపించాలి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఆత్మకూరు: ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి కోరారు. మండలంలోని పెద్దాపూర్, లింగమడుగుపల్లె, అక్కంపేట, అగ్రంపహాడ్ గ్రామాల్లో శనివారం బూత్‌స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వివరించాలన్నారు. నియోజకవర్గంలో ధర్మారెడ్డి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, దానికి అనుగుణంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, రైతుబంధు కోఆర్డినేటర్ ఎన్కతాల్ల రవీందర్, దుంపల బుచ్చిరెడ్డి, బొల్లబోయిన రవియాదవ్, కాంతాల కేశవరెడ్డి, సావురే రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నీరుకుళ్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మకూరు: మండలంలోని నీరుకుళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో 2006 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాలల్లో జరిగిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, వెంకన్న, సిద్ధిరాజయ్య, వేణుగోపాల్, లక్ష్మణ్, బెంజిమెన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్కర్సు రాజు, చందు, రమణాచారి, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, బలవంతుల శ్రీకాంత్, శ్యామ్, రజిని, మాధవి, ప్రశాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీల బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

● ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్

శాయంపేట : ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నోటిఫికేషన్‌లు విడుదల చేసి మళ్లీ రద్దు చేయడం కేసీఆర్ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ఉద్యోగాల కోసం అప్లై చేసిన నిరుద్యోగ యువత లక్షల రూపాయాలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నారని అన్నారు. కానీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. నిరుపేద బిడ్డలను బలిగొంటున్న బీఆర్‌ఎస్‌ను ఓడించి భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మళ్లీ బీఆర్‌ఎస్ గెలిస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. చదువుకున్న బిడ్డల కోసం వారి తల్లిదండ్రులు, ప్రజలు ఆలోచించాలని కోరారు. బీఆర్‌ఎస్‌ను ఓడిస్తేనే రాష్ట్రానికి మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్, జిల్లా నాయకులు రజిని యాదవ్, లక్ష్మణ్, చంటి, అనిల్, సాయిగౌడ్, కిరణ్ ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద నరేష్

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

పరకాల: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమని టీఎంకేఎంకేఎస్ పరకాల అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జం స్వామి, మోరె కుమారస్వామి స్పష్టం చేశారు. టీఎంకేఎంకేఎస్ 22వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శనివారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేపల వృత్తినే నమ్ముకొని జీవనం గడుపుతున్న మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి పాలకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంకేఎంకేఎస్ మండల నాయకులు ముల్కలపల్లి భిక్షపతి, కుక్కల అశోక్, వీర్ల మంజుల, సరోజన, హిమబిందు, బొజ్జం శ్యామల తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావంలో పాల్గొన్న టీఎంకేఎంకేఎస్ నాయకులు

బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో ఫ్లెక్సీల నిషేధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పరకాల: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో ఫ్లెక్సీలు నిషేధమని, ఎవరైనా ఎన్నికల నిబంధనలను ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి అన్నారు. పశువుల సంత, దామెర చెరువు ట్యాంక్ బండ్ వద్ద జరుగనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. 32 ఫీట్లతో ఏర్పాటు చేస్తున్న రావణసుర ప్రతిమ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం జరిగే సంతను గంగా వైన్స్ పక్కన ఖాళీ స్థలంలోకి మార్చనున్నట్లు తెలిపారు. సద్దుల బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు చేశామన్నారు.